ప్రజాశక్తి

గురువారం 15 జూన్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఉక్కుపై నేటికీ కేంద్రం క్రూరత్వం

◆ విలువైన ఆస్తులను తెగనమ్మే కుతంత్రం ◆ సుదీర్ఘకాలంగా పోరాడుతున్న కార్మికులు



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

తెలుగు రాష్ట్రాలకు తలమానికంగా నిలిచే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రంలోని కాషాయ ప్రభుత్వం తన క్రూరత్వాన్ని కొనసాగిస్తూనే ఉంది. 'ఉన్న ఆస్తులమ్మేసి బతకండి, ఆస్తులారిపోతే ఇంటికి పొండి, ఉక్కు ఫ్యాక్టరీని మేం అమ్మేస్తాం' అన్న విధానాన్ని కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా ఏకమై స్టీల్‌ప్లాంట్ రక్షణకు నిలబడుతున్నా నీరుగార్చే యత్నాల్లోనే కాషాయ సర్కారు ఉంది. ఇప్పటికే ఉత్తరప్రదేశ్‌లోగల వీల్ ప్లాంట్‌ను అమ్మేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. తాజాగా విశాఖపట్నంలోని స్టీల్ ఆస్తుల వేలానికి కేంద్రం ముందుకడుగులేసింది. 853 రోజుల నుంచి విశాఖ కార్మికులు, ప్రజా సంఘాల నేతలు ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడానికి వీల్లేదంటూ వివిధ రూపాల్లో పోరాడుతున్నా ఏ మాత్రమూ పట్టించుకోకుండా దుందుడుకుగా ముందుకెళ్తోంది. విశాఖలో తొమ్మిదేళ్ల బిజెపి పాలనా విజయాలపై బహిరంగ సభలో పాల్గొనేందుకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వచ్చిన రోజునే విశాఖలోగల విలువైన స్టీల్‌ప్లాంట్ ఆస్తుల అమ్మకానికి యాజమాన్యంతో జిఒ జారీ చేయించడం కేంద్ర అరాచక పాలనకు అద్దం పడుతోందంటూ మేధావులు సైతం విమర్శలు గుప్పిస్తున్నా ప్రధాని నరేంద్ర మోడీ తన దూకుడును తగ్గించకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. అమిత్ షా విశాఖ సభలో పాల్గొని స్టీల్‌ప్లాంట్ విషయాన్ని కనీసం ప్రస్తావించకుండా ఢిల్లీకి వెళ్లిపోవడం చూస్తే కార్మికుల పట్ల నిర్లక్ష్యం ఎంతో అర్థమవుతోంది.

రూ.5 వేల కోట్ల కోసం

రూ.3 లక్షల కోట్ల ఆస్తిపై వేటా ?

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సజావుగా నడిచేందుకు అవసరమైన రా మెటీరియల్ (ఐరన్ ఓర్, కొకింగ్ కోల్)కు రూ.5 వేల కోట్లును బ్యాంకుల నుంచి కేంద్రం హామీ ఇచ్చి ఆదుకుంటే ఉత్పత్తి గణనీయంగా ముందుకు సాగిపోయేది. కానీ స్టీల్‌ప్లాంట్‌ను విశాఖలో లేకుండా చేసే కుట్రపూరిత వ్యూహంలో భాగంగా నరేంద్రమోడీ ప్లాంట్ మొత్తం విలువ రూ.3 లక్షల కోట్లను తెగనమ్మేసే పథకంతో అడ్డగోలుగా ముందుకెళు న్నాడు. దీంట్లో భాగంగా ఈ నెల 10న విశాఖ నగరంలోని హెచ్‌బి (హౌసింగ్ బోర్డు) కాలనీలోగల 22 ఎకరాలు, ఆటోనగర్‌లోగల క్వార్టర్స్ స్థలం రెండు ఎకరాలు (4 ల్యాండ్ పార్సిల్స్), పెదగంట్యాడలోగల ఒక ల్యాండ్ పార్సిల్ (434.75 చదరపు అడుగుల పాత హెల్త్ సెంటర్ స్థలం)ను అమ్మకానికి పెడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. దీంతో కార్మికవర్గం మరింత భగ్గుమంది. రెండేళ్లకుపైగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేక ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా ప్రజలు, కార్మికవర్గం, మేధావులు పాల్గొంటూ మద్దతు పలుకుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒక రాష్ట్ర ప్రయోజనాలన్నిటినీ దెబ్బతీస్తూ కేంద్రం మొండితనంతో వ్యవహరించడంపై తీవ్రస్థాయిలో విశాఖ ఉక్కుపరిరక్షణ మిగతా 2లో..



రక్తదానం చేస్తున్న మహిళలు

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు రక్తదానం

అందరిలో స్ఫూర్తినింపిన ఉక్కు ఉద్యోగులు

ప్రజాశక్తి - ఉక్కునగరం : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రక్తదానంతో పరిరక్షించుకోవాలనే మహోన్నత ఆశయంతో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఆరు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరం ఈసారీ విజయవంతమైంది. బుధవారం ఉక్కు నగరంలోని సిడబ్ల్యుసి -1లో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో 564 మంది రక్తదానం చేశారు. రెడ్ క్రాస్, లైఫ్‌షేర్, లయన్స్ క్లబ్ రక్త నిధి సంస్థల ప్రతినిధులు సేవలందించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.రామ్మూర్తి మాట్లాడారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ప్లాంట్‌ను అమ్మేస్తుండటం బాధేస్తోందన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్ భట్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ముగ్గురు ప్రాణాలు కాపాడగలుగుతామని వివరించారు. ఈ మహోన్నత కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు పాల్గొనడం ద్వారా సంస్థకు సమాజంలో మరింత గౌరవం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ అభినందించారు. స్టీల్‌ప్లాంట్ సిఐఎస్‌ఎఫ్ కమాండెంట్ అత్తర్ మహమ్మద్ అనీఫ్ మాట్లాడుతూ దేశంలో రక్త లేమి ద్వారా ప్రాణాలు కోల్పోతున్నవారి సంఖ్య మరింత పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి రక్తదాన శిబిరాలు జరగడం ద్వారా ప్రజల ప్రాణాలను కాపాడుకోగలుగుతున్నామని అన్నారు. దీనిలో పాల్గొన్న రక్తదాతలను ఆయన అభినందించారు. జ్ఞాపికలను మిగతా 2లో..

నీట్‌లో ఉత్తమ ఫలితాలు

▶ వార్త 3లో..

విద్యార్థులకు అందని జెవికె కిట్లు

▶ వార్త 4లో..

క్రికెట్ బ్యాట్‌తో దాడి : ఒకరు మృతి

▶ వార్త 3లో..

వైసిపి పాలనలో విశాఖ అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న శ్రీభరత్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి పాలనలో విశాఖ అభివృద్ధి శూన్యంగా మారిందని టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.శ్రీ భరత్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ పార్లమెంటు పరిధిలోని అన్ని శాసన నియోజకవర్గాల్లో పర్యటిస్తానన్నారు. వైసిపి పాలనలో ప్రజల జీవన పరిస్థితులు దారుణంగా వున్నాయన్నారు. డ్రెయినేజీ గోడలు కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా, నిర్మాణాలు లేవన్నారు. కాలుష్యం ఒక ప్రధాన సమస్యగా ఉందని వాపోయారు. దోమల బెడద విపరీతంగా వుందన్నారు. పేదలకు మేలు చేయాలనుకుంటే టిడ్కో ఇళ్లను ఇప్పటికీ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అమరావతిలో తొందరగా పేదలకు ఇళ్లు ఇవ్వాలన్న ఆతృత దేనికి అన్నారు. ఎయిడెడ్ స్కూల్స్ రద్దుతో సెయింట్ ఆంథోనీ, సెయింట్ పీటర్ స్కూల్స్ మూతపడ్డాయని, ఇది చాలా బాధాకరమైన విషయమని అన్నారు. ఇచ్చిన పథకాలతో సంతోషంగా వున్నామని ఏఒక్కరూ చెప్పడంలేదన్నారు. ప్రతి వార్డులో పథకాలు ఆగిపోయాయన్న అంశాలే తమ దృష్టికి వచ్చాయని చెప్పారు. హైదరాబాదుతో పోటీ పడాల్సిన విశాఖ నగరం నానాటికీ దిగజారిపోతోందని ఆవేదన వెలుబుచ్చారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ దక్షిణ ఇన్‌ఛార్జ్ గండి బాబ్జీ మాట్లాడుతూ నియోజవర్గంలో ఆరు వారాల పాటు మీ కోసం మీ భరత్ కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రజల మిగతా 2లో..

రైలు ప్రయాణికుల అవస్థలు

◆ తాడి - అనకాపల్లి మధ్య గూడ్స్ పట్టాలు తప్పడంతో పలు రైళ్లు రద్దు, ఆలస్యం

◆ విశాఖ స్టేషన్‌లో వందలాది మంది పడిగాపులు



విశాఖ స్టేషన్‌లో నిలిచిన రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

తాడి - అనకాపల్లి మధ్య రాజుపాలెం రైల్వేగేట్ సమీపంలో బుధవారం ఉదయం అనకాపల్లి వైపు బొగ్గులోడుతో వెళు న్న గూడ్స్ రైలు మూడు భోగీలు పట్టాలు తప్పిన ఘటనలో రెండు కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో పలు రైళ్లు రద్దయ్యాయి. కొన్ని ఆలస్యంగా నడిచాయి. కొన్నింటిని అధికారులు రీ షెడ్యూల్ చేశారు. విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లాల్సిన రైళ్లన్నీ దాదాపు ఆలస్యంగా నడిచాయి. అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టడంతో ఉదయం 10 గంటలకు ట్రాక్‌ను పునరుద్ధరించారు. ఈ క్రమంలో 22825 షాలిమార్ - ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 4 గంటలు, 22882 భువనేశ్వర్ - పూణే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 6 గంటలు, 17481 బిలాస్‌పూర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ 5 గంటలు, 12841 షాలిమార్ - ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ కోరమండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 4 గంటలు, 15930 న్యూ టిన్సుకియా - తాంబరం మిగతా 2లో..



పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

మొదటి పేజీ తరువాయి..

ఉక్కుపై నేటికీ కేంద్రం క్రూరత్వం

కమిటీ ఆధ్వర్యాన పోరాడుతున్న కార్మికులంతా మండిపడుతున్నారు.

ప్రభుత్వ రంగంలో కొనసాగే వరకూ పోరాటం : ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, మనుగడను దెబ్బతీసే కేంద్రంలోని బిజెపి సర్కారుపై పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్‌లు సిహెచ్.నరసింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కన్వీనర్ కెఎస్‌ఎన్.రావు, కో - కన్వీనర్లు జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు సంయుక్త ప్రకటనలో స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు ఐరన్ ఓర్ లేకుండా చేస్తూ మరోవైపు విజయనగరం జిల్లా గర్భాంలోని మాంగనీస్ మైన్స్‌ను మూసేసి కేంద్రం కుట్రలు కొనసాగించడం రాష్ట్ర ప్రభుత్వ సహకారం లేకుండా జరగదంటూ నేతలు మండిపడుతున్నారు. కేంద్ర నిర్ణయాన్ని కనీస స్థాయిలో ప్రభుత్వం తప్పుపట్టకపోవడాన్ని నేతలు తూర్పారపడుతున్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రామ్మూర్తి

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు రక్తదానం

అందజేశారు. రక్తదాన శిబిరాన్ని టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి నమ్మి సింహాద్రి, గుర్తింపు యూనియన్ అధ్యక్షులు కెఎస్ఎన్ రావు, జె.రామకృష్ణ, వైఎస్‌ఆర్‌టియుసి అధ్యక్షులు వై.మస్తానప్ప, డివిఆర్ యూనియన్ అధ్యక్షులు డివి.రమణారెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఎన్.రామారావు, స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, అధ్యక్షులు వైటి.దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, నాయకులు బి.అప్పారావు, కె.గంగాధర్, యు.వెంకటేశ్వర్లు, టివికె.రాజు, నీలకంఠం, కృష్ణమూర్తి, మరిడయ్య, పుల్లారావు తదితరులతో పాటు వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరం వద్ద చే గువేరాకు నివాళ్లర్పిస్తున్న నాయకులు

ఉక్కును అమ్మే అధికారం కేంద్రానికి లేదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే అధికారం కేంద్రానికి లేదని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోరుతూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు బుధవారానికి 804వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ కమిటీ నాయకులు కూర్చున్నారు. తొలుత విప్లవ నేత చేగువేరా 95వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. డివైఎఫ్‌ఐ నాయకులు సంతోష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చేగువేరా చిత్రపటానికి రఘు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వై.రాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ గొప్పతనాన్ని తెలియజెప్పారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు, డివైఎఫ్‌ఐ నాయకులు గణేష్, సిఐటియు నాయకులు కెవిపి.చంద్రమౌళి, రామారావు, హరి పాల్గొన్నారు.

వైసిపి పాలనలో విశాఖ అభివృద్ధి శూన్యం

కష్టాలు, సమస్యలను స్వయంగా తెలుసుకున్నామన్నారు. పోర్టు ప్రదేశంలో బల్క్ కార్గో బహిరంగంగా విడిచి పెడుతున్నారని, దీని వల్ల కాలుష్య సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. 33వ వార్డు వెంకటేశ్వర మెట్ట ఇళ్లపై దేవాదాయ శాఖ విభాగం వేధింపులు ఎక్కువగా వున్నాయని అన్నారు. నిత్యం రద్దీగా ఉండే జగదాంబ, పూర్ణా మార్కెట్ కూడళ్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు కావాలని తమ పాదయాత్రలో ప్రజలు తెలిపారన్నారు.

రైలు ప్రయాణికుల అవస్థలు

ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా నడిచాయి. అలాగే పలు రైళ్లు రద్దయ్యాయి. ఫలితంగా బుధవారం ప్రయాణ ఏర్పాట్లు చేసుకున్న వారంతా రైల్వేస్టేషన్‌లో పడిగాపులు కాశారు. తాము ఎక్కాల్సిన రైలు రాకపోతుందా ? అని గంటలకొద్దీ వేచి చూశారు.

విశాఖలో మరిన్ని హోటళ్లు, రెస్టారెంట్లు అవసరం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో పర్యాటక రంగంలో ప్రథమ స్థానంలో ఉన్న విశాఖ నగరానికి దేశ విదేశాల నుంచి వచ్చే ప్రజలకు, పర్యాటకులకు నాణ్యమైన, రుచికరమైన ఆహార వంటకాలను సరసమైన ధరలకు అందించే రెస్టారెంట్లు, హోటళు మరిన్ని రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎపి అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. డాబాగార్డెన్స్ దరి జ్యోతి థియేటర్ లేడీస్ గేట్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన వెంకటేశ్వర ఫుడ్స్ 'నాయుడు గారి కుండ బిర్యానీ రెస్టారెంట్'ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రుచికరమైన తెలుగు వంటకాలను సౌకర్యవంతమైన రెస్టారెంట్‌లో అందించే పేరున్న వెంకటేశ్వర ఫుడ్స్ నాయుడు 'కుండ బిర్యానీ' విశాఖలో కూడా విజయవంతం అవుతుందన్నారు. రాష్ట్రానికి ఎగ్జిక్యూటివ్ రాజధానిగా ఎదుగుతున్న విశాఖలో హోటల్ రంగానికి మంచి డిమాండ్ ఉందన్నారు. పర్యాటక రంగంలో కూడా విశాఖ ప్రథమ స్థానంలో ఉందన్నారు. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ ఏడు సంవత్సరాలకుపైగా అనుభవంతో మూడు రాష్ట్రాలలో నాయుడు గారి కుండ బిర్యానీ వ్యాపారాన్ని రెస్టారెంట్‌లు ఏర్పాటు చేసి విజయవంతంగా నడుపుతూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న సంస్థ వ్యవస్థాపకులు శ్రీదేవి కృషి అభినందనీయమని కొనియాడారు.



నాయుడుగారి కుండ బిర్యానీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని

అరకు కాఫీ విక్రయశాల ప్రారంభం



అరకు కాఫీ విక్రయ శాల ప్రారంభంలో స్వాతిరాణి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హైదరాబాద్ నగరంలో బుధవారం రాయదుర్గం మెట్రో స్టేషన్ పరిధిలో 'హట్ అరెబికా' (జిసిసి అరకువేలీ కాఫీ) విక్రయశాలను ఆంధ్రప్రదేశ్ గిరిజన సహకార సంస్థ ఛైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి, సంస్థ ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేశ్ కుమార్ ప్రారంభించారు. ఇతర ప్రధాన కూడళ్లలో అతి త్వరలో ఇలాంటి వాటిని పెట్టేందుకు కృషి చేస్తామన్నారు. ఈ విక్రయశాలలో కాఫీతో పాటుగా గిరిజన సహకార సంస్థ గిరిజనుల నుంచి సేకరించిన తేనె, పసుపు, చింతపండు, కుంకుడుకాయలు, సీకాకాయ, ఉసిరి, కొండచీపుర్లు మొదలగు అటవీ ఫల సాయాల నుంచి తయారుచేసిన ఉత్పత్తులను కూడా నగర ప్రజలకు అందుబాటులో తీసుకువస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బుల్లితెర ప్రముఖులు సెల్వరాజ్, కమెడియన్ రాంప్రసాద్, మూవీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, యాక్టర్ జెమినీ శ్రీనివాస్, జిసిసి ఉద్యోగులు పాల్గొన్నారు.

హీరో మోటోకార్ప్ ఫ్యాషన్ ప్లస్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటోకార్ప్ తమ ప్యాషన్ ప్లస్ వాహనాన్ని బుధవారం ఉదయం రేసపువానిపాలెంలోని శ్రీ హర్ష మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంలో ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశాఖపట్నం ది కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ ఛైర్మన్ సిహెచ్.రాఘవేంద్రరావు వాహనాన్ని ప్రారంభించి తొలి వాహనాన్ని కొనుగోలుదారుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా ఆటో మొబైల్ ఫీల్డ్‌లో హర్ష మోటార్స్ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. ఇక్కడ సామాన్యుడికి అందుబాటులో వాహనాలు విక్రయిస్తారన్నారు. హర్ష మోటార్ డీలర్ షిప్ ఎమ్‌డి సురేష్ మాట్లాడుతూ హీరో కంపెనీ ఫ్యాషన్ ప్లస్ బైకు మంచి ఆదరణ పొందిందని అన్నారు. దీని ఎక్స్ షోరూం ధర 75,751గా నిర్ణయించామని తెలిపారు.

16వ వార్డు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 16వ వార్డు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని, ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. బుధవారం ఆమె మూడో జోన్ 16వ వార్డు పరిధిలోని కృష్ణా కాలేజీ ఏరియా, భాను నగర్, కెఆర్‌ఎం.కాలనీ, హెచ్‌బి కాలనీ తదితర ప్రాంతాలలో జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మీతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ వార్డులో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో పట్టణ ప్రణాళిక అధికారి సునీత, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ఎఎంఒహెచ్ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు

రియల్ మి 11 ప్రో సిరీస్ 5జి ఫోన్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : టెక్నాలజీ బ్రాండ్ స్మార్ట్‌ఫోన్ సర్వీస్ ప్రొవైడర్ రియల్ మి ఫ్లాగ్ షిప్ నెంబర్ సిరీస్‌కి సరికొత్త జోడింపుగా తన 11 ప్రో సిరీస్ 5జిని ప్రకటించినట్లు సంస్థ ప్రొడక్ట్ మేనేజర్ శ్రీహరి తెలిపారు. బుధవారం ఉదయం బీచ్ రోడ్‌లోని పార్క్ హోటల్‌లో రియల్ మి 11 ప్రో, రియల్ మి 11 ప్రో ప్లస్ ఫోన్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వినియోగదారులకు మరింత సాంకేతికతను అందించాలనే నిబద్ధతతో అత్యాధునిక ఫీచర్లు, అసాధారణమైన పనితీరు, మంచి డిజైన్లతో నిరంతర ఆవిష్కరణలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. రియల్ మి 11 ప్రో, ప్రో ప్లస్ ఫోన్‌లలో శక్తివంతమైన కెమెరా సిస్టం, అధిక రిఫ్రెష్ రేట్ డిస్‌ప్లే, ఆకట్టుకునే పనితీరు, ప్రీమియం డిజైన్, అధునాతన ఛార్జింగ్ సౌకర్యాలు ఉన్నాయన్నారు. రియల్ మి 11 ప్రో ప్రారంభ ధర రూ.23,999, రియల్ మి 11 ప్రో ప్లస్ ప్రారంభ ధర రూ.27999గా ఉందని అన్నారు. వీటి అమ్మకాలు గురువారం నుంచి రియల్ మీ వెబ్‌సైట్, ఫ్లిప్‌కార్ట్‌లతో పాటు తమ స్టోర్స్‌లో లభిస్తాయని ఆయన తెలిపారు.



ఉత్పత్తులను చూపుతున్న శ్రీహరి

చిన్నారుల చెంతకే అంగన్‌వాడీ విద్య

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అంగన్‌వాడీ కేంద్రంలలో ఫోర్ డెవలప్‌మెంట్ కార్నర్స్ ఏర్పాటు చేసి అంగన్‌వాడీ విద్యను చిన్నారులకు చేరువ చేయాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఎంవిపి సెక్టార్ సూపర్‌వైజర్ వినిసా సుందరి అన్నారు. ఈ మేరకు పెద జాలరి పేట అంగన్‌వాడీ కేంద్రంలో జన భాగీదారీ కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలపై అంగన్‌వాడీలకు బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రవల్లిక, మల్లిక, అంగన్వాడీ కార్యకర్తలు చెల్లయ్యమ్మ, దేవి, నాగలక్ష్మి, విజయ లక్ష్మి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తణుకు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, తణుకు

E.A. No. 3/2021 in E.P. No. 29/2020 in O.S. No. 155/2007

Between:

కోనాల సతీష్ ...*Plaintiff/ DHR*

AND

1. కందుకూరి వెంకట శివరాం ప్రసాద్ (డైడ్)
2. కందుకూరి వీర వెంకట సోమ సూర్య ఫణీంద్రరావు మరియు అదర్స్

...*Defendants/ JDrs*

3. శ్రీమతి శంకరమంచి శ్రీలక్ష్మి, W/o. వెంకటేశ్వరరావు, వయస్సు 52, BSNL Office దగ్గర, అనకాపల్లి, అనకాపల్లి మండలం.
4. శ్రీమతి శేష లక్ష్మి, W/o. ప్రసాద్, వయస్సు 50, RMP Doctor, మొగల్లు, తూర్పుగోదావరి జిల్లా.
5. శ్రీమతి సన్నిధి రాజు రాజేశ్వరి, W/o. తెలియదు, వయస్సు 48, మున్సిపల్ ఆఫీసు దగ్గర, సామర్లకోట, తూర్పుగోదావరి జిల్లా.
6. శ్రీమతి చెరుకూరి ఉషారాణి, W/o. శ్రీనివాసు, వయస్సు 47, గోటేరు, ఇరగవరం మండలం.
7. శ్రీమతి జంద్యాల దేవి, W/o. బాలకృష్ణ, వయస్సు 45, దువ్వ, తణుకు మండలం.

పిటీషనర్/వాది దాఖలు చేసిన ప్రకటన

పై నెంబర్ గ్రంథంలో పిటిషనర్, మిమ్ములను 1వ జేడిఆర్/ ప్రతివాదికి వారసులుగా అనగా E.P నందు 2 టు 7 ప్రతివాదులుగా చేర్చమని దాఖలు చేసిన పిటిషన్ దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు మీకు నోటీసు ఆర్డర్ వేయగా, మీరు కావాలని నోటీసు అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు నోటీసు అమలు నిమిత్తం పేపర్ ప్రకటన ద్వారా నోటీసు ఆర్డర్ వేసినారు. కావున మీరు **20-06-2023వ తేదీన ఉదయం గం॥ 10.30లకు** శ్రీ కోర్టు వారి ముందు మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గానీ హాజరు అయి మీకు ఏమైన ఆక్షేపణలు వున్న తెలియచేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షముగా పై కోర్టు వారు తీర్మానం చేయుదురని ఇందు మూలముగా తెలియచేయడమైనది.

ఐనంపూడి కామేశ్వరరావు
ఐనంపూడి శ్రీదేవి కృష్ణవేణి
అడ్వకేట్స్, తణుకు
సెల్: 9966499955

తణుకు
ది.14-6-2023

పాఠశాలలకు చేరినా సరే ..

విద్యార్థులకు అందని జెవికె కిట్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న విద్యా కానుక (జెవికె) పథకం కింద 9 రకాల వస్తువులను విద్యార్థులకు బడులు తెరిచే రోజునే పూర్తి స్థాయిలో అందజేయాలన్న లక్ష్యం నెరవేరలేదనే చెప్పొచ్చు. జగనన్న విద్యా కానుక ద్వారా ప్రతి విద్యార్థికి ఉచితంగా మూడు జతల యూనిఫామ్, జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్ట్, స్కూల్ బ్యాగ్‌తో పాటు ఆక్స్ ఫర్డ్ తెలుగు/ ఇంగ్లీష్ నిఘంటువు (6-10 తరగతుల విద్యార్థులకు), పిక్టోరియా నిఘంటువు (1-5 తరగతుల విద్యార్థులకు) అందించనున్నారు. వీటితో పాటు 6-9 విద్యార్థులకు ఒక పేజీలో తెలుగు, మరో పేజీలో ఇంగ్లీష్ బైలింగ్వల్ పాఠ్యాంశాలు, 10వ తరగతి విద్యార్థులకు విడిగా తెలుగు, ఇంగ్లీష్ పాఠ్యాంశాలు కలిగిన పుస్తకాలు అందించనున్నారు. ఈ ఏడాది విద్యా సంవత్సరంలో 9వ తరగతి సిలబస్ పూర్తిగా కొత్తదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

బడులు తెరిచినా అందని జెవికె కిట్లు ...

బడులు తెరిచినా జెవికె కిట్లు ఇంకా విద్యార్థులకు అందలేదు. బ్యాగ్‌లు, బూట్లు, సాక్సులు, అరకొరగా పాఠశాలకు చేర్చినా, టెక్స్ బుక్స్, వర్క్ బుక్స్ పలు పాఠశాలల్లో గుట్టలుగా పేరుకుపోయి ఉండడం కనిపించింది.

పాత బ్యాగ్ లతో పాఠశాలలకు

బడులు తెరిచి రెండ్రోజులు అయినా సరే పాత బ్యాగ్‌లతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం కనిపించింది. ఓ పాఠశాలలో జెవికె కిట్లు కోసం విద్యార్థులు క్యూలో నిలబడటం చూస్తే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుందని చెప్పకనే చెప్పవచ్చు.

అరకొరగా పంపిణీ...

జెవికె కిట్లు విద్యార్థులకు అరకొరగానే పంపిణీ చేశారు. దాదాపు ఎక్కువ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందని పరిస్థితి ఉంది._ఓ పాఠశాలలో 240 మంది విద్యార్థుల్లో 180 మందికి కిట్లు అందజేశారు. మరో పాఠశాలలో 250 మందిలో 20 మందికే అందజేశారు. ఇంకో పాఠశాలలో 232 మంది విద్యార్థులకు గాను 125 మందికి అందజేశారు. ఇంకో పాఠశాలలో 115 మందికి 77 మందికి కిట్లు అందజేశారు.

అరకొరగా పాఠ్య పుస్తకాలు

పాత బ్యాగ్‌లతోనే విద్యార్థులు బడులకు..



పాత బ్యాగులతోనే పాఠశాలకు వెళ్తున్న విద్యార్థినులు

వరాహ పుష్కరిణిలో చేపలు మృతి

మూడు రోజులైనా పట్టించుకోని అధికారులు

దుర్వాసనతో భక్తులు, స్థానికుల అవస్థలు



వరాహ పుష్కరిణిలో మృతిచెందిన చేపలు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానానికి పవిత్రమైన వరాహ పుష్కరిణిలో నిత్యం కలకలలాడే చేపలు కొద్దిరోజులుగా మండుతున్న ఎండలకు మృతిచెందుతున్నాయి. శనివారం చాలా చేపలు చనిపోయాయి. చెరువు కిరువైపులా ఒడ్డుకు వచ్చి పడిఉన్నాయి. ఐదు రోజులు కావస్తున్నా దేవస్థానం అధికారులు చెరువులో చనిపోయిన చేపలను తొలగించకపోవడంతో దుర్వాసన ప్రారంభమైంది. మంగళవారం అమ్మవారి పండక్కి వచ్చిన బంధువులు, స్థానికులు ఈ దుర్వాసనతో తీవ్ర అవస్థలు పడ్డారు. స్వామి వారి దర్శనానికి వచ్చే గ్రామీణ ప్రాంత భక్తులు పుష్కరిణిలో స్నానమాచరించి కొండపైకి వెళ్తుంటారు. ఈ దుర్వాసన భరించలేక పుష్కరిణిలో స్నానం చేయకుండానే ముక్కులు మూసుకుంటూ ఈ చెరువులోని నీరు చల్లుకొని స్వామి దర్శనానికి వెళ్లడం కనిపిస్తోంది. దేవస్థానం అధికారులు వెంటనే స్పందించి చెరువులో చనిపోయిన చేపలను వెంటనే తొలగించి దుర్వాసన లేకుండా చేయాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

పార్టీల ప్రచారంగా పండగ స్టేజీలు

ప్రజాశక్తి-సింహాచలం: అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పండుగ సందర్భంగా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ఏర్పాటుచేసిన స్టేజ్ ప్రోగ్రాములు తమ పార్టీ ప్రచారానికి పూర్తిగా వినియోగించుకున్నాయి. వైసిపి స్టేజ్ ప్రోగ్రాంలో జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి 175 స్థానాలు గెలుపొందుతుందని చెప్పారు. భీమిలి ఎమ్మెల్యేని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. టిడిపి స్టేజ్ ప్రోగ్రామ్ వద్ద విశాఖ ఎంపీగా భరతను గెలిపించాలని టిడిపి నాయకులు కోరారు. జనసేన పార్టీ స్టేజ్ వద్ద రానున్న అసెంబ్లీ ఎన్నికలలో భీమిలి నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ టికెట్ ఇస్తే పంచకర్ల సందీప్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఈ ప్రసంగాల కోసం స్టేజ్ ప్రోగ్రాములను 10 గంటలకే నిలిపివేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.

స్థలం స్వాధీనం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక నేరెళ్లవలస కాలనీ వెనుక ఉన్న మండల గ్రామోద్యోగుల సంఘ భవనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు మంగళ వారం అర్ధరాత్రి కూల్చివేసిన నేపథ్యంలో సంబంధిత స్థలం ఆక్రమణకు గురి కాకుండా రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఆక్రమణదారులు శిక్షార్హులు అంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షులు పోతిన వెంకట అప్పారావు, మండల అధ్యక్షులు పల్లంటి శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొని రెవెన్యూ సిబ్బందితో హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేయించారు.

'సెడార్'లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సెడార్ పాఠశాలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు స్వెట్లినా పాల్ రక్తదానం చేశారు. రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. లైఫ్ షేర్ బ్లడ్ గ్రూప్ ఆధ్వర్యాన రక్తాన్ని సేకరించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని వెదుళ్లపాలెంలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శిరీష తెలిపిన వివరాల ప్రకారం వెదుళ్లపాలెం గ్రామానికి చెందిన ఒరుగంటి దుర్గా శ్రావణి(21)కి పెనుగొల్లుకు చెందిన నాగ శివతో వివాహం అయ్యింది.వీరికి పాప ఉంది. ఈమె ప్రస్తుతం రెండు నెలల గర్భిణి. వెదుళ్లపాలెంలో పుట్టింట ఉంటోంది. మంగళవారం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఐటీవలా కడుపునొప్పితో బాధపడుతుందని మృతురాలు తల్లి పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శిరీష వెల్లడించారు.

క్రికెట్ బ్యాట్‌తో దాడి : ఒకరు మృతి

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని పెదతీనార్ల గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన తగాదాలో ఒకరు మృతి చెందినట్లు సిఐ నారాయణరావు బుధవారం వెల్లడించారు. సిఐ చెప్పిన సమాచారం మేరకుపెదతీనార్ల గ్రామానికి చెందిన కారే రమణ (40) మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. పొరుగున ఉన్న సమీప బంధువు మెరుగు లోవరాజు వచ్చి వారించబోగా, ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అప్పటికే ఇరువురి మధ్య వ్యక్తిగత పాత గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో లోవరాజు కోపంతో క్రికెట్ బ్యాట్‌తో రమణ తలపై కొట్టగా, తీవ్రంగా గాయపడిన రమణను స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం, మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారు. కెజిహెచ్‌లో వైద్యం పొందుతూ ఆరోగ్యం విషమించడంతో బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు మృతుడు రమణ ు భార్య కాసులమ్మ ఫిర్యాదు చేసినట్లు సిఐ వెల్లడించారు.ఈ మేరకు హత్య కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు .

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చోడవరం : మండలంలో గజపతినగరం వద్ద ఈనెల 3వ తేదీ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బుధవారం మృతి చెందారు. చోడవరం సిఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం.... మండలంలోని అంబేరుపురం గ్రామానికి చెందిన తనకళ నాయుడు (37) లారెన్స్ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 3న తేదీ రాత్రి నాయుడు గోవాడ వద్ద లారెన్స్ బస్సు దిగి గజపతినగరం వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన పల్సర్ బైక్ ఆయన్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాయుడును అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తూ వచ్చారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బుధవారం బుధవారం తెల్లవారుజామున విశాఖకు తరలిస్తుండగా నాయుడు మృతి చెందాడు. స్థానిక ఎస్సై అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీట్‌లో ఉత్తమ ఫలితాలు





నీట్ ఫలితాల్లో సత్తా చాటిన మారికవలస గిరిజన గురుకుల విద్యార్థులు

ప్రజాశక్తి-యంత్రాంగం

నీట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు తమ సత్తా చాటారు.

పిఎం.పాలెం, మధురవాడ : అల్లూరిసీతారామరాజు జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఎ పిఒ పర్యవేక్షణలో మారికవసలో నడుపుతున్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణా సంస్థలో శిక్షణ పొందిన విద్యార్థులు నీట్ -2023 ప్రవేశ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ పరీక్షకు ఈ పాఠశాల నుంచి 28 మంది విద్యార్థులు హాజరయ్యారని శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ శివప్రసాద్ తెలిపారు. ఈ ఫలితాల్లో చింతపల్లి మండలం, ఈదులబయలు గ్రామానికి చెందిన పేద వ్యవసాయ కూలీ కె.సత్తిబాబు కె.మహేశ్వరి కుమారుడైన కె.ఇస్సా 420 మార్కులు సాధించి ఆలిండియా ఎస్టీ కేటగిరీలో 3073వ ర్యాంకును సాధించాడని, గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు వచ్చే అవకాశాన్ని పొందాడని తెలిపారు. ఐదవ తరగతి వరకు ఎంపీపీ స్కూల్ చిన్నకొత్తూరు గ్రామంలోనూ, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు జిటిడబ్ల్యుఎ స్కూల్ డౌనూరు లోను, ఇంటర్, నీట్ శిక్షణను ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణా సంస్థ మారికవలసలో చదివినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి గిరిజన గురుకులాల్లో టాపర్‌గా నిలిచాడని ప్రిన్సిపల్ తెలిపారు.

చింతపల్లి మండలంలోని పాతకినెర్ల గ్రామంలో ఆదిమ గిరిజన తెగకు చెందిన వ్యవసాయ కూలీ పి.బంగార్రాజు. పి.నీలమ్మల కుమారుడైన పి.మత్స్యరాజు 319 మార్కులు సాధించి ఆలిండియా ర్యాంకును ఎస్టీ కేటగిరీలో 10,731వ ర్యాంకును కైవసం చేసుకుని గవర్నమెంట్ కళాశాలలో బిడిఎస్ కోర్సులో సీటు పొందే అవకాశం సంపాదించాడని వివరించారు. హుకుంపేట మండలం ఈదుల గరువు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ జి.ప్రసాదరావు, జి.లక్ష్మిల కుమారుడు జి.గోపాలరావు 283 మార్కులు సాధించి ఆలిండియా ఎస్టీ కేటగిరీలో 14,651వ ర్యాంకు కైవసం చేసుకుని గవర్నమెంట్ కళాశాలలో బిడిఎస్ కోర్సులో సీటు పొందే అవకాశం సంపాదించాడని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ఎఎస్ఆర్ జిల్లా కలెక్టర్, ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ అభినందనలు తెలిపారు.

సత్తా చాటిన శశి విద్యార్థులు

భీమునిపట్నం : సంగివలసలోని శశి విద్యా సంస్థల విద్యార్థులు నీట్‌లో సత్తా చాటారు. ఈ మేరకు శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణు గోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బి.రవీంద్ర 720 మార్కులకు గాను 697 మార్కులతో ఒబిసి కేటగిరీలో ఆలిండియా 71వ ర్యాంక్, ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 351వ ర్యాంక్, పి.కృష్ణచైతన్య 695 మార్కులతో ఒబిసి కేటగిరీలో 114వ ర్యాంక్, ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 529వ ర్యాంక్, సిహెచ్.హర్షవర్ధన్ 695 మార్కులతో ఒబిసి కేటగిరీలో ఆలిండియా 384వ ర్యాంక్, ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 573వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. కె.హర్షిత 676 మార్కులతో ఒబిసి కేటగిరీలో ఆలిండియా 537వ ర్యాంక్, ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 1912వ ర్యాంక్, జె.తోయజాక్ష 676 మార్కులతో ఒబిసి కేటగిరీలో ఆలిండియా 1957వ ర్యాంక్ సాధించారని తెలిపారు. 690పైన మార్కులు ముగ్గురు, 675పైన 5 గురు, 600పైన 8 మంది, 500కి పైన 40 మంది ర్యాంకులు సాధించినట్లు వివరించారు. సుమారు 45కి పైగా విద్యార్థులు మెడిసిన్ సీట్లు సాధించారని తెలిపారు. అత్యుత్తమ ర్యాంక్ లు సాధించిన విద్యార్థులను శశి విద్యా సంస్థల కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ అభినందనలు తెలిపారు.

పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన జామి తోయజాక్షకు నీట్-2023లో ఓపెన్ కేటగిరిలో ఆల్ ఇండియా 1957వ ర్యాంక్, ఆల్ ఇండియా ఓబిసిలో 559 ర్యాంకు సాధించాడు. తగరపువలస సమీపంలోని సంగివలస శశి కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి నీట్ పరీక్ష రాశాడు.



శశి విద్యార్థి తోయజాక్ష

కన్వేయన్స్ డీడ్‌పై అనుమానాలు?

స్టాంప్ డ్యూటీ ప్రభుత్వం భరిస్తుందా.. పేదలే భరించాలా ?

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక హౌస్ కమిటీ భూములకు సంబంధించి ప్రభుత్వం కన్వేయన్స్ డీడ్ ఇస్తామని చెప్పి, దానికి సంబంధించి రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు వారం రోజులుగా ప్రతి ఇంటికీ వెళ్లి సర్వేలు చేస్తున్నారు. ఆ సర్వేలో భాగంగా పట్టాలో తప్పులు ఉంటే సరి చేస్తున్నారు. జీవోలు 301, 388 కింద గతంలో 7000కుపైగా పట్టాలు మంజూరు చేశారు. వారందరికీ కన్వేయన్స్ డీడ్ ఇస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. హౌస్ కమిటీ పరిధిలో ఉండి పట్టాలు లేని వారికి జీవో 60 ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారికి పట్టాలు మంజూరు చేస్తామని అధికారులు చెబుతున్నారు. కన్వేయన్స్ డీడ్‌కు అయ్యే స్టాంప్ డ్యూటీ ప్రభుత్వం భరిస్తుందా లేక ఉచితంగానే ఇస్తారా అనే ప్రశ్న తలెత్తుతోంది. స్టాంప్ డ్యూటీ చెల్లించాలంటే పేదలపై భారం తడిసిమోపెడవుతుంది. గాజువాకలోని 100 గజాలు స్థలానికి లెక్కవేస్తే ప్రభుత్వ మార్కెట్ రేటు గజం రూ.30 వేలు ఉంది. దాని ప్రకారం స్టాంప్ డ్యూటీ 7.5 ప్రకారం చూస్తే రూ.2.50 లక్షలు చెల్లించాలి. ఇంత మొత్తంలో ప్రజలు చెల్లించాలంటే కష్ట సాధ్యంతో కూడుకున్న పని. ప్రభుత్వం దీనికి సంబంధించి ఏమైనా మినహాయింపు ఇస్తారా, లేదా అన్నది అధికారులు చెప్పడం లేదు. ఒకవేళ ఫ్రీగానే అధీకృత పట్టా ప్రభుత్వ మంజూరు చేస్తే తర్వాత దానికి బ్యాంకు లోన్లు గానీ, మరే ఇతర అవసరాలకు ఉపయోగపడదని స్థానికులు భావిస్తున్నారు. అందుకే దరఖాస్తు సంబంధించి ఆశించినంత స్థాయిలో ప్రజలు ముందుకు రావడం లేదు. ప్రతి ఇంటికీ సచివాలయం సిబ్బంది వెళ్లి అడిగితే తప్ప స్వతహా దరఖాస్తు చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. గాజువాక రెవెన్యూ అధికారులు లెక్కల ప్రకారం 5000 పైచిలుకు మాత్రమే దరఖాస్తులు వచ్చినట్లు చెబుతున్నారు.



ముఖ్యమంత్రి సహాయనిధిని అందిస్తున్న కెకె.రాజు తదితరులు

ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : కేన్సర్‌తో బాధపడుతున్న 50వ వార్డుకు చెందిన గరుగుబిల్లి నిరీషకు రూ.10 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు బుధవారం పార్టీ కార్యాలయంలో అందించారు. నిరీష మూడేళ్లుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆర్థిక ఇబ్బందులను ఆమె తల్లిదండ్రులు కెకె.రాజుకు వివరించారు. కెకె.రాజు స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఇప్పటివరకు సుమారు రూ.8 కోట్లు అందించినట్లు తెలిపారు. నిరీష తల్లిదండ్రులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 లక్షలు ఇవ్వడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ మేరకు కెకె.రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, సీనియర్ నాయకులు పేడాడ రమణకుమారి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాస్, కిరణ్ రాజు, కృష్ణారావు మాస్టర్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు, డ్రైయినేజీకి శంకుస్థాపన చేస్తున్న కామేశ్వరి, కెకె.రాజు

సిసి రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డు పరిధి బాపూజీనగర్, అంబేద్కర్ ఎస్టేట్ ప్రాంతాల్లో రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, మెట్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి సమక్షంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు బుధవారం అంబేద్కర్ ఎస్టేట్ వినాయకుడి ఆలయం వద్ద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ప్రజల సమస్యలను గుర్తించి సిసి రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కె.వెంగళరావు, 47వ వార్డు నాయకులు వసంతల అప్పారావు, సుకుమార్, గురువోజీ, కె.చిన్నా, రాఘవులు, కృపా, భోగి, ముక్క రమణ, సురేష్, అనీల్, చందురెడ్డి, జయకుమార్, కనకరాజు, రమేష్, ఎఇ అర్చన, వర్క్ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-విశాఖపట్నం : జివిఎంసి 41, 42 వార్డుల్లో పొంగిపొర్లుతున్న డ్రెయినేజీ సమస్యను జోనల్ కమిషనర్ ఆర్‌జిబి.కృష్ణ బుధవారం పరిష్కరించారు. దొండపర్తి రోడ్డులో యుజిడి డ్రెయిన్ పొంగిపొర్లడం, పారిశుధ్య సమస్యలు ఉన్నాయని తెలియడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో కలిసి జోనల్ కమిషనర్ బుధవారం వాటిని పరిశీలించారు. డ్రెయినేజీ, పారిశుధ్య సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ కృష్ణ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తున్నామని తెలిపారు. సమస్యలు తన దృష్టికి రాగానే పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.



డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తున్న జోనల్ కమిషనర్ ఆర్‌జిబి కృష్ణ

కిడ్నీ మార్పిడి రోగికి సహాయం

ప్రజాశక్తి-సీతమ్మధార : కిడ్నీ మార్పిడి అవసరమైన రోగికి ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సహాయం అందించారు. జివిఎంసి 50వ వార్డుకు చెందిన పేడాడ చిరంజీవికి ఈ నెల 17వ తేదీన కిడ్నీ మార్పిడి చేసుకునేందుకు ఒక హాస్పిటల్‌లో కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేసుకున్నారు. దీనికి సుమారు రూ.3.5 లక్షలు అవసరమైన నేపథ్యంలో ఈ విషయాన్ని కెకె.రాజు దృష్టికి స్థానిక కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ తీసుకెళ్లారు. కెకె.రాజు స్పందించి సంబంధిత హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి సుమారు రూ.1.60 లక్షలు విలువ చేసే ఇంజక్షన్లను ఉచితంగా ఇప్పించేందుకు ఏర్పాట్లుచేశారు. ఈ సహాయం అందించిన హాస్పటల్ యాజమాన్యానికి, కెకె.రాజుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ తన కిడ్నీ మార్పిడికి సహకరించిన కెకె.రాజుకు, హాస్పిటల్ యాజమాన్యానికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు పేడాడ రమణకుమారి, పైడి కృష్ణారావు మాస్టర్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ హాల్ నిర్మాణం


ప్రజాశక్తి-ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు పరిధి వడ్లపూడిలోని భవిత వికలాంగుల కేంద్రం ప్రాంగణంలో ప్రత్యేక ఫిజియోథెరపీ హాలు నిర్మాణానికి కార్పొరేటర్ బొండా జగన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభయ, స్పందన ఫౌండేషన్ల సహకారంతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. తన వార్డులో ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి-సీతమ్మధార : రక్తదానం మరొకరికి ప్రాణదానమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇసుకతోట అర్బన్ ఆరోగ్యకేంద్రంలో రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ, రక్తదానం వల్ల ప్రమాదాల సమయంలో రక్తం పోయిన రోగులకు ఉపయోగించి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఇసుకతోట, మద్దిలపాలెం ప్రాంతాల నుంచి అధిక శాతం యువకులు వచ్చి రక్తదానం చేశారని తెలిపారు. ప్రతి మూడు నెలలకొకసారి రక్తదానం చేసేందుకు యువకులు ముందుకు రావాలని, రక్తదానముచేసి, మరొకరి ప్రాణాలు కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామారెడ్డి, నాగభూషణం, ఇండియన్ రెడ్ క్రాస్ సిబ్బంది, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్ బాధితునికి చేయూత

ప్రజాశక్తి- ములగాడ : పివిఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు పి.వి.సురేష్ సేవల ఆదర్శంగా ట్రస్టు సభ్యులు బుధవారం 59వ వార్డు పరిధి గణపతినగర్‌లోని ఓ కేన్సర్ బాధితునికి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని ట్రస్టు వ్యవస్థాపకులు, 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ ద్వారా అందించారు. ఈ సందర్భంగా పి.వి.సురేష్ మాట్లాడుతూ, ట్రస్ట్ ద్వారా ఎంతోమందికి సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు అనీల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కేన్సర్ బాధితునికి నగదు అందజేస్తున్న కార్పొరేటర్ పి.వి.సురేష్

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -ములగాడ : దుర్గా గణేష్ ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యాన ప్రముఖ పారిశ్రామికవేత్త మజ్జి మాలినాయుడు ఆర్థిక సహాయంతో తయారుచేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని జివిఎంసి 62వ వార్డు పరిధి త్రినాధపురం, దుర్గానగర్ జివిఎంసి ప్రైమరీ స్కూల్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మజ్జి మాలినాయుడు మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహం ఉండడం ఎంతో మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్థానిక పెద్దలు మురళి, నాగరాజు, రవి, కుమార్ సత్యనారాయణ, నరసింహారావు, గంగాధర్, బైరాగి, రమణ రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

వాసవి నూతన కమిటీ ఎన్నిక



వాసవి కమిటీకి అభినందనలు తెలుపుతున్న ప్రతినిధులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయింది. అధ్యక్షులుగా పాండురంగ ప్రసాద్, కార్యదర్శిగా పి.వి.రాంప్రసాద్, ఉపాధ్యక్షులుగా వి.శ్రీనివాస్‌రాజు, జాయింట్ సెక్రెటరీగా నవీన్, అనార్‌బాబు, కోశాధికారిగా ఈ.ప్రభాకర్, బివిఎన్.రావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా బి.నాగిరెడ్డి, ఆర్.చైతన్య, కె.సతీష్, డివిఎస్ రామభద్రరాజు, పవన్ జైస్వాల్, కెవిఎన్ రాజు, బియ్యం కిషోర్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆరిలోవ అభివృద్ధికి కృషి :మేయర్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. జివిఎంసి 11వ వార్డు పరిధి ఆరిలోవ, బాలాజీనగర్, శ్రీకాంత్‌నగర్, పెదగదిలి కూడలి తదితర ప్రాంతాల్లో జివియంసి కమిషనర్ సాయికాంత్‌వర్మతో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని సమస్యపై కమీషనర్‌తో మేయర్ చర్చించారు. ముఖ్యంగా ఆరిలోవ కల్యాణమండపం పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని, ఆరిలోవ కూడలిని అభివృద్ధి చేయాలని, ఆరిలోవ ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాలను తొలగించి వాటిని ఒక క్రమ పద్ధతిలో నిర్మించి తిరిగి వారికి కేటాయించాలని, కేర్ ఆసుపత్రి రోడ్డు వెడల్పు చేయాలని, పలు చోట్ల బిటి రోడ్లు నిర్మించాల్సి ఉందని కమిషనర్ దృష్టికి మేయర్ తీసుకెళ్లారు. కమిషనర్ స్పందిస్తూ పనులను అంచెలంచెలుగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో పట్టణ ప్రణాళిక అధికారి సునీత, డిఎంహెచ్ఒ దామోదరరావు, జెడ్సీ కనక మహాలక్ష్మీ, ఎఎంహెచ్ఒ కిషోర్, ఏఈ అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంవిఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలోని ఎంవిఆర్ కళాశాలలో గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ బాలకృష్ణ బుధవారం తెలిపారు. ఐసిఐసిఐ బ్యాంకు, సినర్జీస్ కాస్టింగ్ లిమిటెడ్ ప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. 25 సంవత్సరాలు వయసు కలిగి బిఏ, బికాం, బిఎస్‌సి, ఎంబిఏ, బిటెక్ పూర్తయిన అభ్యర్థులు హాజరుకావాలని కోరారు. విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ జెరాక్స్‌లు, పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకురావాలని పేర్కొన్నారు.

మానవాళి విముక్తి కోసం పోరాడిన ధీరుడు చే

95వ జయంతి సందర్భంగా ఘన నివాళి



చే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -అనకాపల్లి

ప్రపంచ మానవాళి విముక్తి కోసం భౌగోళిక సరిహద్దులతో సంబంధం లేకుండా, అమెరికన్ సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా తుది శ్వాస వరకూ పోరాడిన ధీరుడు, కోట్లాది మంది యువత గుండెల్లో నిలిచిన గెరిల్లా యోధుడు చే గువేరా అని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల శివాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి గొర్లి తరుణ్, సామాజిక న్యాయవాది గంటా సురేష్ అన్నారు. చే గువేరా 95వ జయంతి సందర్భంగా స్థానిక దొడ్డి రామునాయుడు భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి సామాజిక న్యాయవాది గంటా సురేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ వైద్యశాస్త్రంలో పట్టభద్రుడైన చే గువేరా 1949లో అర్జెంటీనాలో ఒంటరిగా, 1952లో మిత్రుడు ఆల్బర్ట్ గ్రినిడాతో కలిసి లాటిన్ అమెరికా మొత్తాన్ని బైక్ యాత్ర ద్వారా తిరిగారని తెలిపారు. ఈ సందర్భంగా అమెరికన్ సామ్రాజ్యవాద కంపెనీలు ప్రజలను ఎలా దోచుకుంటున్నాయో అర్థం చేసుకున్నాడని, దోపిడీని అరికట్టాలని, పేద ప్రజలకు అండగా నిలబడాలని అప్పుడే ఒక నిర్ణయానికి వచ్చాడని పేర్కొన్నారు. వైద్యుడిగా కొంతమంది రోగులకు వైద్యం చేసే బదులు సమాజానికి పట్టిన అత్యంత ప్రమాదకరమైన జబ్బును వదిలించాలని భావించాడని చెప్పారు. దోపిడీ సమాజాన్ని కూల్చేయడం మినహా మరో మార్గం లేదని నమ్మి దాని కోసం తన ప్రాణాలను సైతం బలిపెట్టాడని తెలిపారు. శత్రువుల వ్యూహాలను పసిగట్టి ఎత్తులకు పైఎత్తులు వేసి శత్రువు సైన్యాన్ని చిత్తు చేయడంతో ఆయన దిట్ట అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దోని కాశీ, చలపతి, నాయుడు పాల్గొన్నారు.



చేగువేరా చిత్రపటానికి పూలమాలు వేస్తున్న అప్పలరాజు

నక్కపల్లి: విప్లవ వేగుచుక్క చే గువేరా 95వ జయంతినిస్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు చే గువేరా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎం.అప్పలరాజు మాట్లాడుతూ విప్లవ వేగుచుక్క చేగువేరా పేరులోనే ఉత్తేజం, చైతన్యం ఉందన్నారు. నేటితరానికి ఎంతోస్ఫూర్తి, మార్గదర్శి చేగువేరా అన్నారు. ప్రపంచంలో అసమానతలు రూపుమాపాలని, పేదరికం లేని సమసమాజం రావాలని, సామ్రాజ్యవాదం నశించాలని పోరాడిన యోధుడు చేగువేరా అని, ఆయన ఆశయ సాధనకు నేటితరం యువత ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పిక్కి రాజు,పిక్కిరాము తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న నిపుణులు

కంటి ఆపరేషన్లకు 30 మంది ఎంపిక

ప్రజాశక్తి-కె.కోటపాడు

డాక్టర్ వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శంకర్ ఫౌండేషన్ వారు మండలంలో చౌడువాడలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీపీ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు ప్రారంభించారు. చౌడువాడ, మల్లంపాలెం, చిరికివారిపాలెం, గరుగుబిల్లి గ్రామాలకు చెందిన కంటి రోగులు ఈ వైద్య శిబిరానికి తరలివచ్చారు. మొత్తం 75 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించగా 30 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ అరుణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ చందన, కోఆర్డినేటర్ పైడిరాజు, కుంచా మణికంఠ శంకర్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎండలో ఇంటికి వెళ్తున్న విద్యార్థినులు

మండుటెండలో విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

పాఠశాలల పున:ప్రారంభ సమయానికి ఎండలు తగ్గలేదు. ప్రభుత్వం యథావిధిగా జూన్ 12న పాఠశాలలను పున:ప్రారంభించింది. దీంతో విద్యార్థులు ఎండలోనే తప్పనిసరిగా పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. ఎండలు మండుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో మధ్యాహ్నం 11 గంటల వరకు పాఠశాలలను ఒంటి పూట కొనసాగిస్తున్నారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు పెట్టి అనంతరం విడిచిపెడుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎండలో ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు దిబ్బిడి హైస్కూల్ నుండి బుచ్చయ్యపేట వెళ్లే విద్యార్థులు ఎండలో పరీక్షలు రాసే అట్టలను నెత్తిపై పెట్టుకొని ఇబ్బందులు పడుతూ వెళ్లారు. ప్రభుత్వం కొద్దిరోజుల పాటు పాఠశాలల పున:ప్రారంభాన్ని వాయిదా వేసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు, ప్రతిపక్షాలు కోరినా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రభుత్వ మొండివైఖరికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-కెకోటపాడు : తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో మండలంలోని గొండుపాలెంలో నిర్మిస్తున్న రామాంజనేయ ఆలయ పనులను హిందూ ధర్మ ప్రచార పరిషత్ సూపరింటెండెంట్ ఎస్‌కె చంద్రమౌళీశ్వర శర్మ, ప్రముఖ పురాణ పండితులు చల్లా సత్యనారాయణ బుధవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు బండారు అర్జున మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి పది లక్షల రూపాయలు మంజూరు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు మామిడికాయల నాయుడు, బండారు మంగపతి, మద్దాల రాము, బండారు సూర్యనారాయణ, సర్పంచ్ బండారు కనకమల్లేశ్వరి, ఎంపీటీసీ వంటకు నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెల ద్వారా సకాలంలో సేవలు అందాలి

జిల్లా స్పెషలాఫీసర్ నివాస్



సమావేశంలో మాట్లాడుతున్న నివాస్, చిత్రంలో కలెక్టర్ రవి, జెసి జాహ్నవి తదితరులు

ప్రజాశక్తి- సబ్బవరం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలను, సేవలు సకాలంలో, సక్రమంగా అందించాలని అనకాపల్లి జిల్లా స్పెషల్ ఆఫీసర్, రాష్ట్ర హెల్త్ కమిషనర్ జె.నివాస్ ఆదేశించారు. మండలంలోని అమృతపురం రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బికెల ద్వారా అందజేస్తున్న విత్తనాలు, ఎరువులు, రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాలను ప్రజల్లోకి అందేలా వ్యవసాయ సిబ్బంది కృషి చేయాలన్నారు. కస్టం హైరింగ్ సెంటర్లు (సిహెచ్‌సి), ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖల ద్వారా అందజేస్తున్న పథకాలపై సవివరంగా సమీక్ష నిర్వహించారు. ఈ పథకాలు రైతులకు సక్రమంగా అందుతున్నది, లేనిది రైతులతో సంభాషించి వారి యొక్క అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుతున్న పథకాలపై రైతులు సంతృప్తి వ్యక్తం చేయడంతో ప్రత్యేక అధికారి వ్యవసాయ శాఖ సిబ్బందిని అభినందించారు. ఈ సమీక్షలో కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్ రావు, సర్పంచ్ బైలపూడి గౌరీ రామారావు, ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాసరావు, స్థానిక వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, ఏఈఓ బాలరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు పి. భావన పాల్గొన్నారు.

ఆరు నెలల వయసులో అద్భుత ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి

అద్భుతమైన ప్రతిభతో ఆరు నెలల చిన్నారి మంత్రి లాస్విక ఆర్య వరల్డ్ వైడ్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి చోటు సాధించారు. అనకాపల్లి మండలం రేబాక గ్రామానికి చెందిన వెంకట నారాయణమూర్తి, తేజస్విని దంపతుల కుమార్తె లాస్విక ఆర్యకు ప్రస్తుతం 9 నెలలు వయస్సు. 6 నెలల వయసులో ఆమె తల్లి తేజస్విని ఇంట్లో కూరగాయలు, జంతువుల బొమ్మలు చూపించి వాటిని గుర్తించడంలో శిక్షణ ఇచ్చారు. 3 నిమిషాల 36 సెకన్లలో 11 కూరగాయల బొమ్మలను గుర్తించిన వీడియోను తీసి గత మార్చ్ నెలలో వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డుకు పంపించారు. 24 జంతువుల బొమ్మలను గుర్తించిన మరో వీడియోను ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డుకు పంపించారు. వాటిని పరిశీలించిన నిర్వాహకులు చిన్నారి లాస్విక ప్రతిభను మెచ్చుకొని ఈ నెల 12, 13 తేదీలలో బంగారు పతకం, ప్రశంసాపత్రాలను అందజేశారు. అంతర్జాతీయ స్థాయి గల రెండు సంస్థల బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం కల్పిస్తూ వారి యూట్యూబ్, ఇన్‌స్ట్రాగ్రామ్, పేస్ బుక్, ట్విట్టర్ ఖాతాలలో వీడియోను పోస్ట్ చేశారు.



వరల్డ్ వైడ్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్లతో చిన్నారి లాస్విక ఆర్య



ఎంవిఆర్ తనయుడు సతీష్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

ఘనంగా పోతురాజు పండగ

ప్రజాశక్తి- మునగపాక రూరల్

మండలంలోని ఉమ్మలాడ గ్రామంలో పోతురాజు పండుగ మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దీనికి ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. కార్యక్రమంలో భాగంగా కంకణాల బ్రదర్స్ ఆధ్వర్యంలో మెగా డాన్స్ షో నిర్వహించారు. ముందుగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ముత్యాల సతీష్‌కు కంకణాల బ్రదర్స్ ఆధ్వర్యంలో తీన్మార్‌తో స్టేజి మీదకు స్వాగతం పలికి గజమాలవేసి సీల్డ్ బహుకరించి, శాలువా కప్పి చిరు సత్కారం చేశారు. అనంతరం ముత్యాల సతీష్ మాట్లాడుతూ ఎం.వి.ఆర్ అనేది పేరు కాదని బ్రాండ్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మలాడ గ్రామ ప్రజలు, ఎంవిఆర్ యువసేన సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఇంటర్ బెటర్‌మెంట్ పరీక్షా ఫలితాల్లో

ఉషోదయ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చోడవరం

ఇంటర్మీడియట్ బెటర్మెంట్ పరీక్ష ఫలితాల్లో ఉషోదయ కళాశాల విద్యార్థులు అనకాపల్లి జిల్లాలో మంచి మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగానికి చెందిన టి.భవ్యశ్రీ 470 మార్కులకు గాను 462 మార్కులు, బి.లాహిరి 470 మార్కులకు 452 మార్కులు సాధించింది. బైపీసీ విభాగంలో వై ఝాన్సీ 440 మార్కులకు గాను 428 మార్కులు సాధించింది. వివిధ విభాగాల్లో మరి కొంతమంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. వీరిని కళాశాల చైర్మన్ జె రమణజీ అభినందించారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉషోదయ చైర్మన్ రమణాజీ

'ఫీజు ఎక్కడ కంస మామ?' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

టిఎన్ఎస్ఎఫ్ ముద్రించిన 'ఫీజు ఎక్కడ కంస మామ? పోస్టర్‌ను టిడిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజవర్గ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రతి విద్యార్థికి విద్యాదీవెన సకాలంలో ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు అనేకమైన కుంటి సాకులతో జిల్లాలో సుమారు 4,200 మంది విద్యార్థులకు ఫీజులు ఎగనామం పెట్టాడని ఆరోపించారు. కళాశాల యాజమాన్యాన్ని టీసీలను ఇవ్వాలని మొర పెట్టుకుంటే ప్రభుత్వం నుండి తమకు విద్య దీవెన సొమ్ము జమకాలేదని వారు చెబుతున్నారని తెలిపారు. ఇంట్లో ప్రతి విద్యార్థికి "అమ్మ ఒడి" ఇస్తానని చెప్పి కేవలం కుటుంబానికి ఒక్కరికీ మాత్రమే ఇచ్చి జగన్ రెడ్డి మోసం చేశాడన్నారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెద్దిరెడ్డి నాగ వెంకటరమణ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచలేదన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవర శివ యాదవ్, నాయకులు పిట్ల హరీష్, సింగంపల్లి ప్రసాద్, ప్రగడ తేజ, గొసల కిషోర్, సంకర్ల సాయిదీప్, వరదా మోహన్ కాంత్, కసిరెడ్డి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి నేత నాగజగదీశ్వరరావు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు



మాట్లాడుతున్న ఎంపిడిఒ రవికుమార్

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - కశింకోట

ప్రభుత్వ పథకాలపై ప్రజలలో అవగాహన కల్పించాలని ఎంపిడిఒ వివి.రవికుమార్ విఒఎలను ఆదేశించారు. స్థానిక మండల మహిళ సమాఖ్యలో విఒఎల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని, పుస్తకాలు నిర్వహణ సక్రమంగా జరగాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలలో గ్రేడింగ్ సక్రమంగా నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ వి ధర్మారావు, ఏపిఎం శ్రీనివాసరావు, సమాఖ్య కార్యదర్శి లక్ష్మి, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

18న పూడిమడకలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని పూడిమడక గ్రామంలో ఆదివారం సురక్ష హెల్త్ ఫౌండేషన్, విష్ణు డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ చేపల సుహాసిని రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగన్నాథ స్వామి ఆలయం ఎదుట గ్రామ సచివాలయం ఆవరణలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ శిబిరంలో పలు రోగాలకు సంబంధించిన ప్రత్యేక వైద్య నిపుణులు విచ్చేసి, రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు.



పోషక కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పోషక కిట్లు పంపిణీ


ప్రజాశక్తి- మునగపాక రూరల్

మండలంలోని మూలపేట అంగన్వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణీలకు వైయస్సార్ సంపూర్ణ పోషక కిట్లను సర్పంచ్ భీశెట్టి గంగప్పల నాయుడు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి శ్రీలక్ష్మి, మహిళా పోలీస్ సరస్వతి, వార్డు మెంబర్లు కాండ్రేగుల వరలక్ష్మి, అంగన్వాడీ టీచర్ నాగమణి, వాలంటరీ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

24 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

బ్రాండిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 108వ ఉచిత కంటి వైద్య శిబిరంలో ఎంపిక చేసిన 24 మంది కంటి రోగులకు విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి వైద్యాలయంలో ఆపరేషన్లు చేశారు. కంటి ఆపరేషన్లు చేయించుకున్న 24 మంది తిరిగి వారి సొంత గ్రామాలకు బుధవారం చేరుకున్నారు. శంకర్ ఫౌండేషన్, బ్రాండిక్స్ కలిసి సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు.



కంటి ఆపరేషన్ చేయించుకున్న మహిళలు

ప్యాకేజీల కోసమే మెడికల్ కాలేజీ తరలింపు


ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి.సత్యవతి, మంత్రి గుడివాడ అమర్నాథ్ తమ ప్యాకేజీల కోసమే మెడికల్ కాలేజీని తరలించారని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. స్థానిక గవరపాలెం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. కేంద్రీయ విద్యాలయంపై ఎంపీ, ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి లేదన్నారు. అనకాపల్లిలో వైసిపి చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీ సత్యవతికి చిత్తశుద్ధి ఉంటే ఎంపీ ల్యాడ్స్, సిఎస్ఆర్ నిధుల నుండి ఎన్టీఆర్ ఆసుపత్రిలో సిటీ స్కాన్‌ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తమ ప్రైవేటు ఆసుపత్రి కొసమే ఎంపీ సత్యవతి ఎన్టీఆర్ ఆసుపత్రిని నిర్వీర్యమవుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ళ సురేంద్ర, బిఎస్ఎంకె జోగి నాయుడు, పొలారపు త్రినాథ్, తలారి కాశీ నాయుడు, షేక్ బాబర్, కొణతాల రత్న కుమారి, ఆకుల నానాజీ, చిదిరెడ్డి శ్రీనివాసరావు, చదరం శివ అప్పారావు, కాంద్రేగుల రాజు, భాను చంద్ర అఖిల్, పెంటకోట ప్రసాద్, కర్రి నాయుడు, సత్యవతి, ఆళ్ళ జగన్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి-సబ్బవరం

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్తును అందించడానికి ఏపీ ఈపీడీసీఎల్ నిరంతరం కృషి చేస్తుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తెలిపారు. ప్రజాశక్తిలో బుధవారం ప్రచురించిన విద్యుత్ కోతలు ఆపాలి శీర్షిక ప్రచురించిన వార్తకు స్పందించిన ఆయన సబ్బవరంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలను పాటిస్తూ అప్రమత్తంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. రెండు రోజుల క్రితం వచ్చిన వర్షాలు, భారీ గాలుల వలన దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గించడానికి, లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించడానికి, అదనపు ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే 1912 కాల్ సెంటర్‌కి ఫోన్ చేసి సేవలను సద్వినియోగం కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఈపీడీసీఎల్ డిఈఈ నిరీక్షన్ అంబేద్కర్, ఏఈలు అశోక్, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణ సమస్యలపై జివిఎంసి అనకాపల్లి జోనల్ కమిషనర్ ఎస్.వెంకట రమణకు కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు బోయిన భానుమూర్తి యాదవ్ మాట్లాడుతూ అనకాపల్లిలో దాదాపుగా 15 మినీ రక్షిత వాటర్ ట్యాంకులు ఉండగా, వాటిని శుభ్రపరచలేదన్నారు. జోనల్ కార్యాలయం వద్ద డంపింగ్ కేంద్రాన్ని తక్షణమే దూర ప్రాంతానికి తరలించాలని, అధునాతన పద్ధతిలో చెత్త నిర్వాహణ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. హోటల్, అల్పాహార కేంద్రాలు, పండ్ల రసాల దుకాణాలు, మిఠాయి దుకాణలలో ఆహార భద్రతా అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. వివిధ వ్యాపార సంస్థలు సెల్లార్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నందున ప్రధాన రహదారిలలో ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉందని, జీవీఎంసి, పోలీస్ శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అలాంటి వాణిజ్య సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కాళ్ళ సత్యనారాయణ, సేనాపతి రాజు, కెవి మాణిక్యం పాల్గొన్నారు.

12 గ్రామాల్లో పూర్తయిన సమగ్ర సర్వే

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలో 12 గ్రామాలలో భూ సమగ్ర సర్వే కార్యక్రమం పూర్తయిందని మండల తహశీల్దార్ వై శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు గ్రామాల్లో సమగ్ర సర్వేకు సంబంధించిన పాసుపుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మూడో విడతలో ఎర్రవరం, చీమలపల్లి, గుడివాడ తదితర గ్రామాలలో సమగ్ర సర్వే పనులు ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట పూరిడిగడ్డ లో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు బుధవారం ఆ గ్రామానికి చెందిన ఆదర్శ రైతు కర్రి నాగేశ్వరరావు తన సొంత ఖర్చుతో మజ్జిగ పంపిణీ చేశారు. పని చేస్తున్న ఉపాధి కూలీలకు గతంలో ప్రభుత్వమే మజ్జిగ పంపిణీ చేసేది. నేటి వైసిపి ప్రభుత్వం ఆ కార్యక్రమాన్ని ఉపసంహరించుకుంది. మండుటెండలో తమ భూములకు సాగునీరు అందించడానికి పూడిక తవ్వుతున్న కూలీలకు దాహార్తిని తీర్చడానికి కర్రి నాగేశ్వరరావు మజ్జిగ అందజేశారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు వియ్యపు రాము పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని దిబ్బడి గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చలో విజయవాడ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా నెలకొన్న భవన కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలన్నదే తమ ఆకాంక్ష అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బర్నికాన దేముడు, బీ.రాజు, బీ.శ్రీనివాసరావు, బొట్ట. వెంకటేశ్వరరావు, ఎర్రి నాయుడు, పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న వైసిపి సిఇసి సభ్యులు శ్రీనివాసరావు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ గ్రామానికి చెందిన కుబిరెడ్డి శ్రీను చిన్న వయస్సులో కిడ్నీ సంబంధిత వ్యాధితో మరణించగా, ఆయన కుటుంబానికి పలువురు ఆర్థిక సాయం అందించారు. బొంకుల దిబ్బ, నూకాంభిక యూత్ రూ.88 వేలు, మరిడిమాంబ యూత్ రూ.20 వేలు, ఫొటోగ్రాఫర్స్ ఆసోషియేషన్ సభ్యులు రూ.25 వేలు మొత్తం లక్షా 33వేల రూపాయలు వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు చేతుల మీదుగా కుబిరెడ్డి శ్రీను కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, నాయకులు పైల హరీష్, రెడ్డి శ్రీనువాసరావు, పైల పైడింనాయుడు, వర్రి హరి, యూత్ సభ్యులు, ఫొటోగ్రాఫర్స్ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రముఖుల విగ్రహాల ఏర్పాటుకు సన్నాహాలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం

అచ్యుతాపురం మండల కాంప్లెక్స్ సముదాయంలో, పోలీస్ స్టేషన్ విశ్రాంతి భవనం పక్కన ప్రముఖుల విగ్రహాల ఏర్పాటుకు గ్రామ సర్పంచ్ కె.విమలా నాయుడు ఆధ్వర్యంలో సన్నాహాలు చేస్తున్నారు. జాతిపిత మహాత్మా గాంధీ, శాంతి బోధకుడు గౌతమ బుద్ధుడు, జ్యోతిరావు పూలే విగ్రహాలను నిర్మించడానికి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 20 లేదా 21 తేదీల్లో వైవి సుబ్బారెడ్డి చేతుల మీదుగా వీటిని ప్రారంభించనున్నారు. విగ్రహాల సంరక్షణకు గాను చుట్టూ ఇనుప కంచె వేస్తున్నారు. అలాగే పూల మొక్కలు నాటడానికి గార్డెన్ తయారు చేస్తున్నారు.

రక్తదానంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-చోడవరం

రక్తదానం ప్రాణదానమని బ్లడ్ క్యాంపెయినింగ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సత్యనారాయణ అన్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవ సందర్భంగా స్థానిక డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం వలన ఎంతోమంది క్షతగాత్రులైన పేదలకు వైద్య సదుపాయం అందుతుందన్నారు. దీనిపై విద్యార్థులందరూ అవగాహన కలిగి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కిరణ్ కుమార్, డాక్టర్ బి లక్ష్మి, డాక్టర్ లక్ష్మీ మంగమ్మ, డాక్టర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సత్యనారాయణ

'జన్ భాగీదారీ'పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -కొత్తకోట : జన్ భాగీదారీ ద్వారా ప్రభుత్వం రూపొందించిన పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమం జయప్రదం చేయాలని, కొత్తకోట సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయ కోరారు. బుధవారం రావికమతం మండలం కొత్తకోట పంచాయతీలో పరిధిలో అన్ని అంగన్వాడీ కేంద్రాలతో కలిపి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు ఉపయోగపడే అనేక రకాల ఆటవస్తువులుతో పాటు ప్రీస్కూల్ కిట్లు, మెటీరియల్ ప్రభుత్వం సరఫరా చేస్తుందని, వాటి వినియోగంపై కార్యకర్తలు అవగాహన పెంచుకోవాలన్నారు. పిపి-1, పిపి-2 వర్క్ బుక్స్‌తో పాటు స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలతో ఇంగ్లీష్ నేర్పించడం, ఆటపాటలతో కూడిన విద్య అందించి, పిల్లల పురోభివృద్ధిపై మూడు నెలలకోసారి చైల్డ్ అసెస్మెంట్ రిపోర్టు సిద్ధం చేయాలన్నారు. ఆరేళ్ళ లోపు పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలో అందించే పూర్వ ప్రాథమిక విద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో జివిఎస్ కె.రమ్య, కిరణ్, రత్నకుమారి, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


కొత్తకోటలో ర్యాలీ చేస్తున్న అంగన్వాడీలు, చిన్నారులు

సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామంలో అంగన్వాడీ కేంద్రం-2లో జన్ భాగీదరి కార్యక్రమంలో భాగంగా మూడేళ్ళ నిండిన పిల్లలను అంగన్వాడీ ప్రీ స్కూల్లో చేర్పించాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు యడ్ల నాయుడు మాట్లాడుతూ అంగన్వాడీలలో ప్రీ స్కూల్ విద్యను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పి. సంతోషి, అంగన్వాడీ కార్యకర్తలు మహలక్ష్మి, భారతి, పైడితల్లమ్మ, ఆయా వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి లలితానగర్‌లోని చాకలిపేటలో ఐసిడిఎస్ విశాఖపట్నం అర్బన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యాన జనభాగ్యదారి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి కార్పొరేటర్ ముక్కు శ్రావణి హాజరై మాట్లాడారు. పిల్లల జీవితంలో మొదటి ఆరు సంవత్సరాలు చాలా విలువైనవని, తర్వాత బుద్ధి, మాటలు వికసింప చేసుకుంటారని తెలిపారు. పిల్లలకు ఇష్టమైన ఆటపాటల ద్వారా వారి మనసులకు హత్తుకునేలా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఇందిర, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మైనర్లకు బైకులిస్తే చర్యలు తప్పవు!

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : డ్రైవింగ్ లైసెన్స్ లేని మైనర్లకు వాహనాలిచ్చిన వాహన యజమానులైన తల్లిదండ్రులకు నర్సీపట్నం టౌన్ పోలీసులు టౌన్ సిఐ నమ్మి గణేష్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టణంలోని మెయిన్‌రోడ్డులో నిబంధనలను విరుద్ధంగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపుతున్న 16 మంది మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు రప్పించి, నర్సీపట్నం టౌన్ సిఐ నమ్మి గణేష్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావతం అవ్వకుండా చూడాలని హెచ్చరించారు. పోలీసు తనిఖీల్లో వాహనాలను డ్రైవింగ్ చేస్తూ మైనర్లు పట్టుబడితే, ఈసారి సంబంధిత బైక్ యజమానిపై కేసు నమోదు చేయక తప్పదని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలు, దుష్ప్రరిణామాలను వాహన యజమానులు, తల్లిదండ్రులకు వివరించారు.

క్రమబద్ధీకరణపై కాంట్రాక్టు లెక్చరర్ల హర్షం

జగన్ చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు లెక్చరర్ల ఉద్యోగాలను సిఎం జగన్ క్రమబద్ధీకరించారని ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బిఎస్ఆర్ శర్మ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గల రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి అసోసియేషన్ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ, 2000 సంవత్సరం నుంచి కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని విన్నవించినా, ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ఈ మేరకు సిఎంజగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వైఎల్‌వి రాజేష్, సభ్యులు కెసిహెచ్ మణి, బి రాజేశ్వరరావు, బి లక్ష్మణరావు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ


గొలుగొండలో విద్యాకానుక కిట్ల పంపిణీలో ఎంపిపి, సర్పంచ్

ప్రజాశక్తి-గొలుగొండ : జగనన్న విద్యాకానుకలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్, వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, ఎంపిపి గజ్జలపు మణికుమారి అన్నారు. బుధవారం ఏఎల్‌పురం మేజర్ పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు కొత్తగా బదిలీ, ప్రమోషన్లపై వచ్చిన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. హెచ్ఎం వంటాకుల సూర్యనారాయణ, విద్యా కమిటీ చైర్మన్ రుత్తల రామలక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలోని సునీల్ శర్మ (వాంబే) కాలనీలో ఉన్న ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలను వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీరజ, టిడిపి నాయకులు పిళ్ళా వెంకటరావు, నాగోతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : 25వ వార్డు పరిధి మధురానగర్ జివిఎంసి హైస్కూల్‌లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలను ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అందించారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ప్రధానోపాధ్యాయులు శాంతికుమారి, బి.దేముడుబాబు, బోగవల్లి గోవింద్, హరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జిజివోస్ కాలనీలో ఉన్న హైస్కూలు, ప్రైమరీ స్కూల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలను 26వ వార్డు టిడిపి కార్పొరేటర్ ముక్కా శ్రావణి పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి ప్రెసిడెంట్ ముక్కా కిషోర్‌కుమార్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపిపి గొర్లి సూరిబాబు బుధవారం పంపిణీ చేశారు. ఎంపిడిఓ నర్సింగ రావు, సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, వైస్ ఎంపిపి విల్లూరి సూర్యకుమారి చంద్రశేఖర్, ఎంపిటీసీలు పన్నీరు వెంకటలక్ష్మి చంటి, పంచదార్ల కన్నారావు, పాఠశాల హెచ్ఎం శంకర్రావు, స్కూల్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాసరావు, బంగారి సంధ్య, వైస్ ప్రెసిడెంట్ చదరం చిన్న, ఆర్టీసీ సత్యనారాయణ, పడాల గణపతి, దంతు లూరి కళ్యాణ చక్రవర్తి, ఆడారి సూరిబాబు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని కశింకోట, తేగాడ పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లును ఎంపిపి కలగా లక్ష్మి బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ చిట్టిబాబు, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి, సర్పంచ్‌లు కలగా గున్నయ్య నాయుడు, మంత్రి జయరజనీ, నీటిపల్లి ఈశ్వరమ్మ, ఎంపీటీసీ మంగతాయారు, మార్కెట్ కమిటీ మెంబర్ నీటిపల్లి లక్ష్మి, కేజీబీవీ స్కూల్ ప్రిన్సిపల్ దొండా చంద్రకళ, హెచ్ఎం స్వర్ణ కుమారి, ఇన్‌ఛార్జి హెచ్ఎం ఆచంట రవి పాల్గొన్నారు

సబ్బవరం : మండలంలోని వంగలి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్టును ఎస్ఎంసి ఛైర్మన్ లగిశెట్టి దేముడుబాబు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రత్నకుమార్, సర్పంచ్ ఆకుల శ్రీహేమ గణేష్, ఎంపీటీసీ గవర తులసి రాజు, యర్రా శ్రీనివాసరావు, వేపాడ స్వామి నాయుడు, కోటిని అమ్మతల్లి నాయుడు, జెట్టి హేమంత్, బుదిరెడ్డ రమణ తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : 40వ వార్డు పరిధి జివిఎంసి హైస్కూల్‌లో విద్యార్థులకు వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు జగనన్న విద్యా కానుకలను అందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు, ఎలిమెంటరీ స్కూలు హెచ్ఎం భారతి, ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చంటిబాబు, సచివాలయం కన్వీనర్ మీసాల సత్యనారాయణ, గృహ సారథి అన్నెపు సూర్య నారాయణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కశింకోటలో కిట్ల పంపిణీ చేస్తున్న ఎంపిపి కలగా లక్ష్మి



ములగాడలో కిట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

కృష్ణదేవిపేటలో అల్లూరి 125వ జయంతి

ముగింపోత్సవం నిర్వహించాలి

ప్రజాశక్తి-గొలుగొండ : స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ముగింపు ఉత్సవం జులై 4న నిర్వహించాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు కోరారు. అల్లూరి జయంతి జులై 4న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందేనన్నారు. గత జులై 4వ తేదీన ఆజాదీ కా అమృత మహోత్సవంలో భాగంగా అల్లూరి 125వ జయంతి ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహించారన్నారు. ఈ సంవత్సరం జులై 4న అల్లూరి 125వ జయంతి ముగింపు ఉత్సవం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ ముగింపు ఉత్సవాల్లో తెలంగాణాలోని హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. అల్లూరి సీతారామరాజు చరిత్రకు సంబంధించి అనకాపల్లి జిల్లాలో చారిత్రాత్మక ప్రాంతాలు ఉన్నాయని, అల్లూరి సేవలకు బ్రిటిష్ సేనలకు నర్సీపట్నం చింతపల్లి ఘాట్ రోడ్డులో జరిగి భీకర యుద్ధంలో నేలకూలబడిన బ్రిటిష్ సేనానులు కవర్డు, హైటర్ల సమాధులు నర్సీపట్నం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ప్రాంతంలో ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో సీతారామరాజు, గంటందొర సమాధులున్న కృష్ణదేవిపేటలోని అల్లూరి స్మారక పార్కులో జులై 4న అల్లూరి 125వ జయంతి ముగింపు ఉత్సవం ఘనంగా నిర్వహించాలని కోరారు.

ఉపాధి అమలుపై సమీక్ష


మాట్లాడుతున్న ఎంపిడిఓ సీతారామరాజు

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని ఉపాధి హామీ పథకం అమలుపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఓ సీతారామరాజు ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్క్ క్లోజర్స్ , జియో ట్యాగింగ్, అగ్రికల్చర్, హార్టికల్చర్ ఆన్‌లైన్ వర్క్ తదితర అంశాలపై చర్చించారు. లక్ష్యానికి అనుగుణంగా కూలీలకు పని కల్పించాలన్నారు .గ్రామాల్లో గుర్తించిన పనులను పక్కాగా నిర్వహించాలని సూచించారు.పని ప్రదేశంలో కూలీలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, వేసవిని దృష్టిలో పెట్టుకుని తప్పనిసరిగా తాగునీరు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ ఈశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇసి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

స్నేహితుని కుటుంబానికి ఆర్థికసాయం


మృతుని భార్యకు నగదు అందజేస్తున్న స్నేహితులు

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని చందనాడ గ్రామానికి చెందిన గోరింట గోవిందరాజులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు మృతుడు స్నేహితులు, 2002 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, రూ. 20 వేలు ఆర్థిక సహాయాన్ని బుధవారం మృతుడు భార్య మీనాక్షికి అందజేశారు. మృతుని భార్య , పిల్లలకు ధైర్యాన్ని ఇచ్చి, తామంతా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పూర్వ మిత్రులు నరిశే దయానంద్ (దిలీప్), సన్యాసిరావు, గురునాథరావు, చిరంజీవి, అశోక్, నాగభూషణం, వీరబాబు, బాలాజీ, చినబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

గడపగడపలో ఎమ్మెల్యేలు ధర్మశ్రీ, బాబూరావు

ప్రజాశక్తి-రోలుగుంట : అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటింటా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. బుధవారం కె.నాయుడుపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొనేందుకు వచ్చిన ధర్మశ్రీకి గ్రామస్తులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ, భవిష్యత్తులో పథకాలన్నీ కొనసాగాలంటే సిఎం జగన్‌కు అండగా నిలవాలన్నారు. ప్రజల చెంతకు సంక్షేమ ఫలాలు తీసుకెళ్తున్న వాలంటీర్లను అభినందించారు.

నక్కపల్లి : జగనన్న ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు బుధవారం చినదొడ్డిగల్లు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు.ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు

కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపిపి ఏనుగుపల్లి రత్నం, జెడ్‌పిటిసి గోసల కాసులమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, వైసిపి నేతలు అయినంపూడి మణిరాజు, పొడగట్ల పాపారావు, నరసింహ మూర్తి ,కొప్పిశెట్టి హరి ,గోవింద్,సత్తిబాబు, బాబ్జి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

నక్కపల్లి : పాఠశాలలు,పున్హ ప్రారంభమైన రోజే విద్యార్థులకు విద్యాకానుక సామగ్రిని అందజేసిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కొప్పిశెట్టి హరిబాబు ఆధ్వర్యంలో బుధవారం చినదొడ్డిగల్లు గ్రామంలో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాభివద్ధికి జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. జగనన్న కిట్లలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, బూట్లు అందించారని, నాడునేడు నిధులతో పాఠశాలలను అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేశారన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు .డిజిటల్ టెక్నాలజీ విద్యాబోధన అందించారన్నారు.


రోలుగుంటలో గడపగడపలో సమస్యలు తెలుసుకుంటున్న ధర్మశ్రీ


జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బాబూరావు

ఉపాధి రోజు కూలి రూ.600 చెల్లించాలి


నినాదాలు చేస్తున్న అప్పలరాజు ,కూలీలు


ప్రజాశక్తి- నక్కపల్లి : ఉపాధి పథకానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి, కూలీలకు దినసరి వేతనం రూ.600 చెల్లించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బుచ్చిరాజుపేటలో ఉపాధి కూలీలతో మాట్లాడుతూ మండుతున్న ఎండల్లో ఉపాధి పని చేస్తున్న కూలీలకు శ్రమకు తగ్గట్టుగా కేంద్ర ప్రభుత్వం కూలీ చెల్లించడం లేదన్నారు. జాబ్ కార్డులో ఏడాదికి వంద రోజులు మాత్రమే పని కల్పిస్తే, మిగతా రోజుల్లో కూలీల కుటుంబాలు ఎలా బతికేదని ప్రశ్నించారు. జాబ్‌కార్డుకు ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.నానాజీ పాల్గొన్నారు

వారాహి యాత్రకు తరలిన జనసైనికులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : జనసేనాని పవన్‌కల్యాణ్ బుధవారం అన్నవరంలో ప్రారంభించిన వారాహి యాత్రకు నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో జనసైనికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ వారాహి యాత్ర ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు, సంక్షేమం పేరుతో సంక్షోభం వైపు అడుగులేస్తున్న వైసిపి ప్రభుత్వ విధానాలను ప్రజలకు పవన్ కల్యాణ్ వివరిస్తారన్నారు. అద్దేపల్లి గణేష్, చిరంజీవి శ్రీను, రేగుబళ్ల శివ, బోయిన చిరంజీవి, వాసం వెంకటేష్, గండెం దొరబాబు, కొప్పాక కల్యాణ్, లంక పాత్రుడు, వాసం వెంకటేష్, కోనా నారాయణ రావు. గూడెపు తాతబాబు పాల్గొన్నారు.

ఉదయం ఎండ ..సాయంత్రం వర్షం

భిన్న వాతావరణంతో జనం ఇబ్బందులు


ఉదయం 8గంటలకే నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలో బుధవారం భిన్న వాతావరణం చోటుచేసుకుంది. ఉదయం భానుడు నిప్పులు కురిపించాడు. సాయంత్రం నాలుగు గంటల వరకు వేడి గాలులతో విరుచుకుపడ్డాడు. దాదాపు 44 డిగ్రీల సెంటీగ్రేడ్ అత్యధిక ఉష్ణోగ్రత నమోదయింది. ఎండ వేడిమికి తట్టుకోలేక జనం విలవిల్లాడిపోయారు. సాయంత్రం 6 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. ఆకాశం నల్లటి మేఘాలతో కమ్ముకుంది..ఉరుములు మెరుపులు, గాలితో కూడిన కొద్దిపాటి వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత వారం రోజులుగా ఎండ వేడిమికి తట్టుకోలేక విలవిలలాడిన జనం, చిన్నపాటి వర్షానికే వాతావరణం చల్లబడి,కాస్త ఉపశమనం పొందారు


సాయంత్రం వేళ ఆకాశం మేఘావృతం

ఎపిఇఎపి సెట్, నీట్ ఫలితాల్లో / ఎసెంట్ క్లాసెస్ విద్యార్థుల సత్తా


వెంకట సాయి చరణ్
నీట్‌లో ఉత్తమ ర్యాంకర్


బొడ్డేపల్లి రాహుల్,
ఎపి ఇఎపిసెట్ ర్యాంకర్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎంసెట్, నీట్ పరీక్ష ఫలితాలలో నగరానికి చెందిన ఎసెంట్ క్లాసెస్ విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం విడుదలైన నీట్ పరిక్ష ఫలితాలలో జి. వెంకటసాయి చరణ్ 635 మార్కులు సాధించాడు. మొట్టమొదటి బ్యాచ్‌లోనే 225 మంది అతి తక్కువ మంది విద్యార్థుల నీట్ పరీక్షకు హాజరై, వారిలో ఒకే ఒక్క క్యాంపస్ నుంచి 100 మంది సీట్లు సాధించారు.

అలాగే బుధవారం విడుదలైన ఎపిఎంసెట్ ఫలితాల్లోనూ ఎసెంట్ క్లాసెస్ విద్యార్థులు మరోసారి అత్యుత్తమ ఫలితాలను సాధించారు. ఎసెంట్ విద్యార్థి బొడ్డేపల్లి రాహుల్ రాష్ట్రస్థాయిలో 283వ ర్యాంకును సాధించాడు. దీంతోపాటు 283, 355, 366, 512, 560, 566 తదితర వెయ్యిలోపు ఉత్తమ ర్యాంకులతో దాదాపు 400 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఎసెంట్ సంస్థ ప్రారంభించిన అనతికాలంలోనే అతితక్కువ మంది విద్యార్థులతో ఎక్కువ ఉత్తమ ర్యాంకుల సాధనకు కృషి చేస్తున్న సంస్థ డైరెక్టర్లు, అధ్యాపక బృందం, విద్యార్థులకు సంస్థ యాజమాన్యం అభినందనలు తెలిపింది.

ఎపిఇఎపి సెట్‌లో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -పాయకరావుపేట : ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎపిఇఎపి సెట్)లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి మంచి ర్యాంక్‌లు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ వి వి ఎస్‌బి భానుమూర్తి తెలిపారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో అగ్రికల్చర్ ఫార్మసీ విభాగంలో తమ కాలేజీ విద్యార్థులు యు.వెంకటేష్ 497వ ర్యాంక్, ఇంజనీరింగ్ విభాగంలో ఎన్. సూర్యచరణ్ 767వ ర్యాంక్, ఎస్.అశోక్ 1258 ర్యాంక్ సాధించారని తెలిపారు. 10వేలలోపు ర్యాకులు 23 మంది విద్యార్థులు సాధించి ప్రతిభ కనబరిచారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్‌విక నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, తోటి విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.


మంచి ర్యాంకులు సాధించిన వెంకటేష్, సూర్యచరణ్, అశోక్

ఆహ్లాదకరంగా బికె.పల్లి రహదారి


కొత్తపల్లి వద్ద ఆహ్లాదకరంగా బికె.పల్లి రోడ్డు

ప్రజాశక్తి -కోటవురట్ల: ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ ద్వారా మొక్కలు నాటడంతో మండలంలో ఇటీవల నిర్మించిన బికెపల్లి రహదారిలో ఆహ్లాదకరమైన వాతావరణం దర్శనమిస్తుంది, ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో సమీప గ్రామాలైన రామచంద్రపాలెం, నీలిగుంట, పాములవాక సహా, నర్సీపట్నం మండలం బంగారయ్యపాలెం ఎరకన్నపాలెం వేములపూడి తదితర గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, స్వగ్రామం బికె.పల్లి కావడం ఆయన ప్రోద్బల్యంతోనే ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో స్థానిక నాయకులు బాబులు, రాంబాబు కృషి కారణంగా రోడ్డు ఆహ్లాదకరంగా దర్శనమిస్తుంది,. దీంతోఆయా ప్రాంతాలవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు, వాహనదారులు ఇరువైపులా పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఉన్న రోడ్డు అందాలను తిలకించి తన్మయులై పోతున్నారు.


రోడ్డు విస్తరణ పనులపై సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం పట్టణంలో 100 అడుగుల రోడ్డు విస్తరణ పనులపై ఆర్‌డిఒ హెచ్‌వి జయరాం అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బుధవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి మున్సిపల్, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, రోడ్లు భవనాల శాఖ, ఆర్‌టిసి, పోలీసు శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణకు చేపట్టాల్సిన చర్యలపై ఎమ్మెల్యే గణేష్ వారితో సుదీర్ఘంగా చర్చించారు. రోడ్డు విస్తరణ పనులకు త్వరలో శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి జగన్ రానున్నారని, దానికి అనుగుణంగా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. భవన యజమానులకు తుదివిడత నోటీసులు అందించిన నేపథ్యంలో ఈ సమీక్షా సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కనకారావు, మున్సిపల్ ఛైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, కౌన్సిలర్లు సిరసపల్లి నాని, మాకిరెడ్డి బుల్లి దొర, అధికారులు పాల్గొన్నారు.

చిరంజీవిరావు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- కోటవురట్ల: ఏటికొప్పాక సుగర్స్ మాజీ చైర్మన్ చిరంజీవిరాజు కుటుంబ సభ్యులను తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత బుధవారం పరామర్శిం చారు, తంగేడు గ్రామంలో రాంభద్రరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, ఆయన మరణానికి కారణం అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు, కార్యక్రమంలో మండల తెలుగుదేశం అధ్యక్షులు జానకి శ్రీను, కోటవురట్ల ఎంపిటిసి పి సూర్యారావు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న అనిత